క్లుప్తంగా

అద్దె వాహనాల డ్రైవర్ల భిక్షాటన



భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

రామగిరి: సింగరేణి సంస్థలో ప్రైవేట్ లారీ, టిప్పర్లపై అద్దె వాహనాల డ్రైవర్లుగా పని చేస్తున్న డ్రైవర్లు చేస్తున్న సమ్మెలో భాగంగా శుక్రవారం భిక్షాటన చేసి నిరసన తెలిపారు. అనంతరం ఆర్జీ–3 ఎస్వోటూ జీఎం రఘుపతికి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అద్దె వాహనాల డ్రైవర్లు పాల్గొన్నారు.

‘ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడతాం’



మాట్లాడుతున్న చంద్రశేఖర్, నాయకులు

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం సాగిస్తామని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు పూదరి చంద్రశేఖర్ అన్నారు. పెద్దపల్లిలో శుక్రవారం మాట్లాడారు. ప్రభుత్వం అన్నిరంగాలను నిర్వీర్యం చేసేలా పాలన సాగిస్తోందని ఆరోపించారు. పోలీసు ఉద్యోగాలకోసం పోటీ పడుతున్న అభ్యర్థులకు ఏడు మార్కులు కలపాలని యూత్ కాంగ్రెస్ ఆందోళనలతో ప్రభుత్వ దిగి వచ్చిందని అనానరు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇష్టానుసారంగా పాలన సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు పెర్క సంతోష్, పెనుగొండ ప్రణయ్, ఈర్ల ప్రవీణ్, పదీప్ తదితరులున్నారు.

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలి



జెడ్పీ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీపీ

కమాన్‌పూర్: మండలంలోని గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుట్ట లింగమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధును ఎంపీపీ రాసకొండ లక్ష్మి శుక్రవారం కోరారు. కళాశాలకు వివిధ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు సాయంత్రం వరకు స్టడీ అవర్స్ ఉండడంతో మధ్యాహ్నం భోజనం లేక నీరసించిపోతున్నారని, విద్యార్థుల ఆకలి తీర్చడానికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఎంపీపీ వెంట సర్పంచ్ ఆకుల ఓదెలు, ఉప సర్పంచ్ రాసకొండ చందు, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, నాయకులు రాసకొండ రవి, గుర్రం లక్ష్మిమల్లు, దండె కిషన్ ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ బాలాజీరావు

సుల్తానాబాద్‌రూరల్: గ్రామాల అభివృద్ధి తన వంతుగా కృషి చేస్తానని ఎంపీపీ బాలాజీరావు అన్నారు. సుల్తానాబాద్ మండలం సుద్దాలలో ఉపాధిహామీ పథకం నిధులు రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఎంపీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజలి, జిల్లా రైతుబంధు సమితి కన్వీనర్ కాసర్ల అనంతరెడ్డి, జెడ్పీటీసీ స్వరూప, ఎంపీటీసీ నిర్మల, ఉపసర్పంచ్ రాజు, జాగృతి మండల కన్వీనర్ బొంకూరి ఐలయ్య, తదితరులున్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పరిశీలన

కమాన్‌పూర్: మండలంలోని గుండారంలో రైతు వేదిక సమీపంలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను శుక్రవారం పీఆర్ డీఈ(క్వాలిటీ) తిరుపతిరెడ్డి పరిశీలించారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం జెడ్పీ చైర్మన్ పుట్ట మధు రూ. 17 లక్షల నిధులు మంజూరు చేయగా పనులు ప్రారంభించారు. పనుల నాణ్యతను డీఈ పరిశీలించారు. పూర్తి స్థాయి పనులు చేయడానికి రూ. 14 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. డీఈ వెంట పీఆర్ ఏఈ రాధ ఉన్నారు.

తప్పని పాట్లు

ప్రత్యామ్నాయం ఉన్నా..

- రైల్వే శాఖ నిబంధనలతో గ్రామీణ ప్రజల ఇక్కట్లు
- రైల్వే గేటుతో 30 గ్రామాల ప్రజలకు ఇబ్బందులు
- ప్రజాప్రతినిధులు స్పందిస్తే వినియోగంలోకి వంతెన



పెద్దంపేట రైల్వేగేటు వద్ద వాహనదారుల పడిగాపులు



నిరుపయోగంగా భూగర్భ వంతెన

రామగుండం: పెరుగుతున్న ప్రజా రవాణా వ్యవస్థతో రైల్వే లైన్ల విస్తరణపై శ్రద్ధ వహిస్తున్న రైల్వేశాఖ రైల్వేగేట్ల వద్ద రాకపోకలు సాగించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైంది. న్యూఢిల్లీ–చెన్నై వెళ్లే గ్రాండ్ రూట్ అంతర్గాం మండల పరిధిలో పెద్దంపేట రైల్వే గేటు ఉంది. ఈ గేటు మీదుగా అంతర్గాం, పాలకుర్తి, ధర్మారం, వెల్గటూర్ మండలాలకు చెందిన సుమారు 30 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. నాలుగేళ్ల క్రితం మూడో రైల్వే ట్రాక్ నిర్మాణం చేపట్టే క్రమంలో వరద నీటి ప్రవాహానికి భూగర్భ వంతెన నిర్మించారు. దీనికి ఇరువైపులా రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ లక్షలాది నిధులతో పెద్దంపేట నుంచి భూగర్భ వంతెన వరకు, భూగర్భ వంతెన నుంచి విలేజీ అంతర్గాం వరకు అప్రోచ్ తారురోడ్డు నిర్మాణం చేపట్టినప్పటికీ వంతెనకు రహదారిని మాత్రం లింక్ చేయలేదు. దీనికి కారణం కేవలం రైల్వే అధికారుల అవసరాల నిమిత్తం మాత్రమే నిర్మించినట్లు, ప్రజా రవాణాకు అనుమతులు లేవంటూ వంతెనకు అడ్డుగా ఇనుప హ్యాంగర్స్ ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. కానీ వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే వరద నీరు ఇరువైపులా నిలిచి రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. దీనిపై స్థానిక ఎంపీ స్పందించి రైల్వే అధికారుల నుంచి అనుమతులు పొంది వంతెన నుంచి వాహనాల రాకపోకలకు అనుమతిస్తే వాహనదారుల ఇబ్బందులు తొలగుతాయని ప్రజలు కోరుతున్నారు.

గేట్లతో ఇబ్బందులు పడుతున్నాం



పెద్దంపేటలో సుమారు వంద మంది కల్లు గీత కార్మికులు రైల్వే ట్రాక్ అవతలి వైపు ఈదులు గీసి ఉపాధి పొందుతారు. నిత్యం రైల్వే గేటు వేసి ఉండడంతో అత్యవసర పరిస్థితుల్లో ద్విచక్ర వాహనంపై వెళ్లాలంటే గేటు వద్ద తప్పనిసరిగా నిరీక్షించాల్సిందే. భూగర్భ వంతెన ఉన్నప్పటికీ గుంతల్లో వరద నీరు నిలిచి రాకపోకలకు అనుకూలంగా లేదు. దీనిపై అధికారులు స్పందించాలి.

– సింగం కిరణ్‌కుమార్‌గౌడ్, పెద్దంపేట

సకాలంలో గమ్యస్థానానికి చేరే పరిస్థితి లేదు



కాలేజీకి వెళ్లడానికి పొట్యాలలో ఆర్టీసీ బస్సు ఎక్కితే పెద్దంపేట గేటు మీదుగా రామగుండంకు చేరుకోవాల్సి ఉంటుంది. ఆర్టీసీ బస్సు వచ్చే సమయానికి నిత్యం రైల్వేగేటు వేసి ఉండడంతో సకాలంలో కాలేజీకి చేరుకోవడం లేదు. దీనికి ప్రత్యామ్నాయం మరో రహదారి లేకపోవడంతో ఆలస్యమైనా గేటు వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది.

– అక్షయ్, డిగ్రీ విద్యార్థి, పొట్యాల.

రాకపోకలకు అనుమతివ్వాలి



పెద్దంపేట భూగర్భ వంతెన కింద నుంచి నేరుగా విలేజీ అంతర్గాంకు చేరుకోవచ్చు. వంతెన కింది నుంచి అధికారికంగా రాకపోకలకు అనుమతిస్తే అంతర్గాం జంక్షన్‌కు చేరుకోకుండానే నేరుగా విలేజీ అంతర్గాంకు చేరుకునే వీలుంటుంది. దూరభారం తగ్గేందుకు భూగర్భ వంతెనను వినియోగంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది.

– బాలసాని రమాదేవి, విలేజీ అంతర్గాం

అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి



మంథనిలో ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు, పేదలు

రామగుండం: అర్హులైన ప్రజలకు కార్పొరేషన్‌లో నివేశన స్థలాలు, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం రామగుండం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ జాహెద్‌పాషాకు వినతిపత్రం అందజేశారు. కార్పొరేషన్ పరిధిలో వేలాది మందికి కనీసం ఇంటి స్థలాలు, సొంతిళ్లు లేకపోవడంతో అద్దె గృహాలతో ఆర్థికంగా చితికిపోతున్నారన్నారు. సొంత స్థలం ఉన్న వారికి మూడు లక్షలు పరిహారం అందజేస్తున్నామని పేర్కొంటున్న ప్రభుత్వం ఐదు లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 9వ తేదీన చలో హైదరాబాద్ పిలుపునిచ్చామన్నారు. కార్యక్రమంలో ఐక్య వేదిక ప్రతినిధులు నాంసాని శంకర్, తుంగపిండి మల్లేశ్, ఉపేందర్, సురేశ్, రమణ, సునీత, శంకర్, తిరుపతి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ధర్నా

మంథని: పేదలు అనేక మంది సొంత ఇళ్లు లేక అద్దె ఇంట్లో ఉంటూ అప్పులపాలవుతున్నారని ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. శుక్రవారం మంథని తహసీల్దార్ కార్యాలయం ఎదుట పేదలతో కలిసి ధర్నా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క పేదవాడికి కూడా ఇంటి స్థలం ఇవ్వలేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ల సందీప్ అన్నారు. అనంతరం తహసీల్దార్ బండి ప్రకాష్‌కు వినతి పత్రం అందించారు. అర్హులైన పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎరుకల సాగర్, బందెల రాజ్‌కుమార్,ఏల్పుల సురేశ్, బాపు రవి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేత



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 16 మందికి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దాతు శ్రీనివాస్, ధరణి స్వరూప, సాగంటి శంకర్, పాముకుంట్ల భాస్కర్, తస్నీం బాను, రఫీక్, రాకం వేణు, పిల్లి రమేష్ పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యాలయంలో కుష్ఠు నివారణపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యాధికారి అనుదీప్

ధర్మారం: కుష్ఠు నివారణలో భాగంగా మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో శుక్రవారం మండల వైద్యాధికారి అనుదీప్ ఆధ్వర్యంలో కుష్ఠు నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి అనుదీప్ మాట్లాడుతూ శరీరంపై మొద్దుబారిన మచ్చలు, ఎర్రని, తెల్లని రాగి వర్ణమచ్చలు ఉన్నట్లు అయితే పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధిసోకిన వారికి ఎన్‌డీటీ ద్వారా పూర్తిగా నయం అవుతుందన్నారు. వెంటనే చికిత్స చేయించుకుంటే ఎలాంటి అంగవైకల్యం రాదన్నారు. సమావేశంలో విద్యాలయం ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, డీపీఎంవో ప్రకాష్, హెచ్ఎస్ శ్రీనివాస్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటివెలుగు వైద్య శిబిరాలు



పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: కంటివెలుగును ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మమతారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో శుక్రవారం కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి, కమిషనర్ శ్రీనివాసరెడ్డితో కలసి ప్రారంభించారు.కంటిజబ్బులను గుర్తించి అప్పటికప్పుడే అద్దాలు అందించేలా కంటివెలుగు కార్యక్రమాన్ని మలివిడతగా చేపట్టినట్లు పేర్కొన్నారు. సమావేశంలో వైద్యసిబ్బంది ఫర్హామక్సూన్, ఎలిజబెత్‌రాణి, సునయన, రాణి, శైలజ, తిరుమల, రాజేశ్వరి, శ్రీనివాస్ రాజు, జయరాజ్ తదితరులున్నారు.

సుల్తానాబాద్‌రూరల్: ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న కంటి వెలుగును అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శశికళ, గర్రెపల్లి పిహెచ్‌సీ వైద్యులు మధుకర్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలం నారాయణపూర్‌లో కంటివెలుగు శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ మూల స్వరూప, వైద్యురాలు అనిత, సూపర్‌వైజర్ వెంకట్ రెడ్డి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రామగుండం: కార్పొరేషన్ 20వ డివిజన్‌లో కంటి వెలుగు వైద్య శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్ వైద్య సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ చేరాలు, డాక్టర్ మాధురి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు ఉన్నారు.

జూలపల్లి: గ్రామాలలో ప్రభుత్వం అమలు చేస్తున్న కంటి వెలుగు వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలని ఎంపీపీ రమాదేవి సూచించారు. మండల పరిధిలోని బాలరాజుపల్లెలో రెండో విడత కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ రాజయ్య,మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రంగారెడ్డి, వైస్ ఎంపీపీ రమేశ్,ఎంపీడీవో వేణుగోపాలరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఓదెల:పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుంపుల, గూడెం, ఇందుర్తి గ్రామాల్లో ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. ఆయా గ్రామాల మీదుగా జమ్మికుంట , సుల్తానాబాద్‌కు వెళ్లే వాహనాలను తనిఖీ చేసి సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు.

‘అధికార పార్టీ నాయకుల రాద్ధాంతం తగదు’

మంథని: సమస్యలపై అవగాహన ఉన్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అన్ని గ్రామాల్లో అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేసి మంత్రి దృష్టికి తీసుకెళ్లారని, నిధుల మంజూరుపై కృతజ్ఞతలు తెలిపితే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు రాద్ధాంతం చేయ్యడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మంథని రాకేశ్, యూత్ కాంగ్రెస్ మంథని నియోజకవర్గ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి పనులకు పంపించిన ప్రతిపాదనలు క్యాంపు కార్యాలయంలో ఉన్నాయన్నారు. నాయకులు కుడుదుల వెంకన్న ఎరుకల ప్రవీణ్, వేల్పుల రాజు, రాం రాజశేఖర్, తదితరులు ఉన్నారు.

పాఠశాలకు ప్రొజెక్టర్ వితరణ

ఎలిగేడు: మండలంలోని నర్సాపూర్ ప్రభుత్వ పాఠశాలకు సింగిల్ విండో చైర్మన్ గోపు విజయభాస్కర్ రెడ్డి, గోపునారాయణరెడ్డి తమ తండ్రి జ్ఞాపకార్థం ప్రొజెక్టర్‌ను శుక్రవారం వితరణ ఇచ్చారు. స్పెషల్ ఆఫీసర్ తిరుపతిరావు హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు దోహదపడాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ నాగరాజమ్మ, హెచ్ఎంలు వెంకటేశ్వర్ రెడి, జీవన్ రెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు.

ఇంటింటికీ బట్ట సంచులు పంపిణీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ 8వ వార్డులో శుక్రవారం జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ బొమ్మతో ముద్రించిన బట్ట సంచులను ఎంఐఎం కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి, ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్ సన్నీ పంపిణీ చేశారు. సంచులతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను అందించడం చర్చనీయాంశమైంది. ఇంటి ముంగిట కౌన్సిలర్ పేరిట ముద్రించిన పేపర్‌పై వార్డు ప్రజల అభిప్రాయాలను కూడా సేకరిస్తున్నారు.

కొనసాగుతున్న శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



చండీ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని హరిహర ఆలయంలో శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మూడో రోజు శుక్రవారం . ఉదయం ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీదేవి, వైస్ ఎంపీపీ శిరీష, తారుపల్లి మాజీ సర్పంచ్ గోపాలకిషన్ రావు దంపతులు, హైకోర్టు న్యాయవాది అశోక్ రావు దంపతులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి క్యాంపు (కొత్తకలెక్టరేట్) లో నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, టీఎన్‌జీవో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొంకూరి శంకర్, రాజనరేందర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

కూరగాయల మార్కెట్ దారిలో గోడ నిర్మాణం



మార్కెట్‌కు వెళ్లే దారిలో నిర్మించిన గోడ

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని మున్సిపల్ కూరగాయల మార్కెట్‌కు వెళ్లే దారిలో నిర్మించిన గోడ వివాదాస్పదంగా మారింది. గోడ నిర్మాణం శుక్రవారం ఉదయం వెలుగులోకి రావడంతో, మార్కెట్‌లోని పలువురు వ్యాపారస్తులు ఈ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నారు. దీనిపై సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.సుమన్‌రావు టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ సతీశ్ పరిశీలించారు. మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఎలాంటి అనుమతులు లేవని, వెంటనే నిర్మాణ పనులు నిలిపివేయాలని కమిషనర్ తెలిపారు. అయితే మార్కెట్ ముందున్న స్థలం పార్కింగ్ జోన్లుగా ఉన్నాయని బల్దియా అధికారులు వెల్లడిస్తున్నారు. కాగా, గోడ నిర్మించిన స్థలాన్ని గతంలో కొనుగోలు చేశామని, తమకు అనుకూలంగా కోర్టు నుంచి కూడా జడ్జిమెంట్ వచ్చిందని, నిర్మాణం చేపట్టడానికి అనుమతి ఇప్పించాలని కోరుతూ గోడ నిర్మించిన వ్యక్తి కమిషనర్‌కు శుక్రవారం వినతి పత్రాన్ని సమర్పించాడు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీవో సుదర్శన్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల పరిషత్ అధికారి సుదర్శన్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛ శుక్రవార్ పనులను పర్యవేక్షించారు. రోడ్ల కిరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగింపజేశారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి ఆవరణను శుభ్రంగా ఉంచుకునే తీరునే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.

పెద్దపల్లిలో...

మున్సిపల్ పరిధిలోని 9 వ వార్డులో శుక్రవారం స్వచ్ఛశుక్రవార్‌లో భాగంగా పారిశుధ్య పనులను కౌన్సిలర్ ఎరుకల కల్పన ఆధ్వర్యంలో నిర్వహించారు. మురుగునీటి కాలువల్లో నీరు నిలవ కుండా చర్యలు చేపట్టారు.

సీఎం కేసీఆర్ కప్ టోర్నమెంట్‌కు ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న నాయకులు

సుల్తానాబాద్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 5 నుంచి ప్రారంభం కానున్న సీఎం కేసీఆర్ కప్ టోర్నమెంట్‌కు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రౌండ్ ను చదును చేయడంతో పాటు మట్టిపోసి క్రీడాకారులకు ఇబ్బందులు కలగకుండా జేసీబీ సహకారంతో చదును చేయించారు. ఈనెల 5న పెద్దపల్లి శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి ప్రారంభించనున్నట్లు విద్యార్థి జేఏసీ జిల్లా కో కన్వీనర్ సూర శ్యామ్ తెలిపారు. ఇప్పటికే క్రికెట్‌లో పాల్గొనే జట్లను డ్రా తీసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సూర శ్యామ్, బండారిలక్ష్మణ్, సందీప్, కార్తిక్,పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కారుణ్య నియామక పత్రాలు అందజేత

రామగిరి: సింగరేణి సంస్థ ఆర్జీ–3 పరిధిలో ఏపీఏ ఏరియాలో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల డిపెండెంట్‌లు ఐదుగురికి శుక్రవారం ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. నలుగురు పురుషులకు, ఏపీఏలో ఒక మహిళకు ఆర్జీ–3 కి పోస్టింగ్ ఇచ్చినట్లు జీఎం తెలిపారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు గౌతం శంకరయ్య, అధికారులు పాల్గొన్నారు.

పోతారం ఎత్తిపోతలకు నిధులు కేటాయించాలి

మంథని: మండలం పోతారం వద్ద ప్రతిపాదిత ఎత్తిపోతలకు నిధులు కేటాయించి ఈ ప్రాంత రైతాంగం ఆశలు నెరవేర్చాలని మంథని మాజీ జెడ్పీటీసీ మూల సరోజన డిమాండ్ చేశారు.మంథని ఎత్తిపోతలకు నిధులు కేటాయించకుండా చెన్నూర్‌కు అవకాశం కల్పించారని, తద్వారా రైతులకు అన్యాయం జరిగిందన్నారు. ప్రభుత్వం బడ్జెట్‌లో ఖచ్చితంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎత్తిపోతలతో 30 వేల ఎకరాలకు మేలు జరుగుతుందన్నారు.

ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ కు సన్మానం

కమాన్‌పూర్: కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన దాసరి రాయలింగు, గుర్రం లక్ష్మిమల్లును శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఎలువాక ఓదెలు, రాజేశం, లక్ష్మనర్సయ్య, బాద్రపు మల్లేశ్ తదితరులున్నారు.

అద్దె బస్ డ్రైవర్లకు శిక్షణ

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని ఆర్టీసీ డిపోలో శుక్రవారం ప్రైవేట్ హైర్ బస్ డ్రైవర్లకు భద్రతపై శిక్షణా కార్యక్రమాన్ని డిపో మేనేజర్ మల్లేశం నిర్వహించారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా డ్రైవింగ్‌పై అవగాహన కల్పించినట్లు డీఎం తెలిపారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాంలో డ్రైవర్లతో పాటు అద్దె బస్సుల యజమానులను కూడా భాగస్వామ్యం చేసినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా డ్రైవర్లు మత్తు పదార్థాలు సేవించడం, డ్రైవింగ్‌లో సెల్‌ఫోన్ మాట్లాడటం చేయరాదని.క్రమశిక్షణతో నిబంధనలు పాటించాలని సూచించారు.

సంక్షేమ బోర్డుకు రూ.10 కోట్లు కేటాయించాలి

ఓదెల: తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంక్షేమ బోర్డుకు బడ్జెట్‌లో రూ.10 కోట్లు కేటాయించాలని ఉద్యమకారుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాడ నారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం ఓదెల మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నంది విగ్రహానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వెంకటరెడ్డి, బాలయ్య, రాములు పాల్గొన్నారు.

సమాచారం

6 నుంచి పీర్ పహాడ్ దర్గా ఉత్సవాలు

రామగిరి: మండలంలోని బేగంపేటలో పీర్ పహాడ్ దర్గా ఉర్సు ఉత్సవాలు ఈ నెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు దర్గా ముజావర్లు ఎండీ. సాబీర్, ఎండీ. ఇమ్రాన్, సాజీద్, అక్రమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రాత్రి గంధం(సంధల్), మంగళవారం జాతర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

10న ఓదెల మండల సర్వసభ్య సమావేశం

ఓదెల: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 10న ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ కునారపు రేణుకదేవి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి సత్తయ్య తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. విద్యార్థులకు ఏప్రిల్ 16 ఉదయం 6వ తరగతి విద్యార్థులకు, అదే రోజు ఏడు నుంచి పదో తరగతి విద్యార్థులకు 2 గంటల నుంచి 4 వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు.